నెలలో చివరి రోజు

కోడి కూసింది.

సూర్యుడు, ఎర్రటి కళ్లతో నిద్రలేచాడు

పక్షులు కిలకిల అంటున్నాయి.

మహారాజు—కథ



సుబ్బారావుకు మెలకువ వచ్చింది. కానీ కళ్లు తెరవలేదు. ప్రక్కమీదనుంచి లేవనూలేదు. కానీ గిన్నెలచప్పుడు, పెళ్ళాం, సుందరి సాధింపులు, గొణుగుడు, వినుక్కోవటం వినపడుతూనే వున్నాయి. అలాంటి సమయంలో నిద్రలేస్తే, ఏం జరుగుతుందో సుబ్బారావుకు అనుభవైక

యువ మహారాజు

తారకరామారావు

వేద్యమే!

"ముండా సంసారం! వద్దు మొర్రో అంటే, చదువుకోనీయకుండా ఈ పెళ్ళిచేసి, రొంపలో తోశారు. తెల్లారి లేచిందగ్గర్నుంచీ వెధవపనితో ప్రాణం దాలాస్తున్నది!... హాయిగా మా అక్కలాగా చదువుకుని వుద్యోగంచేస్తే సుఖమన్నా దక్కేది-

"ఓసెవ్! మొద్దుముండా! లే!.... ఏరా కుంకా ఇంకా మొహంకడగటం కాలేదూ! ఉన్న పళ్ళపొడంతా తింటే రోగమొచ్చి చస్తావురా!.... అరేయ్ పెద్దోడా! స్నానం చెయ్యకుండా ఏం ఆటలురా! ఆ నీళ్ళన్నీ కారిపోతున్నాయ్-

వెధవ బొక్కెన. కొని రెండు నెలలు కాలేదు. అప్పుడే కారి వస్తున్నది."

ఇలా సుందరి పనస చదువుతుంది. సుబ్బారావుకు అప్పుడప్పుడు అనుమాన మొస్తుంది. నిజంగా సుందరికి సంసారం మీద విసుగూ జీవితంమీద విరక్తీ, తనతో కాపురం అసహ్యమూ కలుగ చేశాయా? అని!

పెళ్ళయి, మొదటికాన్పు అయ్యేదాకా సుందరి చాలా ప్రేమగా, ఆశగా సుబ్బారావును కౌగలించుకునేది. అడపాదడపా మరీ మోహం కలిగితే, నిద్రనటించే భర్తను ముద్దుపెట్టుకునేది తియ్యగా! వేడిగా!

పిల్లలు వరుసగా పుట్టడం, మధ్యలో రెండుసార్లు గర్భస్రావం అవడంతో, సుందరి చీకేసిన మామిడితొక్కలా అయింది. జుత్తు బాగా వూడిపోయింది ఉన్న కాస్తంతా, సగం తెలుపు, సగం నలుపు. కళ్ళక్రింద నల్లగా చారలు. పొట్ట వచ్చింది. చీరకట్టు బిగించేచోట తెల్లగా అర. ఆ అస్తిపంజరానికి యింకో పొట్ట. కాస్త వూపిరి పోస్తే ఎలా వుంటుంది! అలా అయింది సుందరి.

ఖర్చులు పెరగటం, దాంతో సమంగా ఆదాయం పెరక్కపోవడంవల్ల, మజ్జిగ పలుచన, ఇల్లు ఇరకాటం, కాఫీలో డికాషన్ కంటె నీళ్ళు ఎక్కువపాలుం డటం, గుడ్డలు మరకలుపట్టడం, పగిలిన అద్దం, బల్బులులేని గది, చెడిపోయిన ఫాను, ఇలా ఇంట్లో పరిస్థితి తయారైంది.

సుబ్బారావుకు ఓ వదినగారుంది. ఆవిడ చదువుకుని ఉద్యోగం చేసుకుంటు న్నది. ఆవిడకు పిల్లా పీచూ లేరు. ఎందు కంటే ఆవిడకస్సలు పెళ్లే కాలేదు. ఆవిడ వివాహానికి వ్యతిరేకి గాదు. కానీ పెళ్ళి కాలేదు. అప్పుడప్పుడు వైరాగ్యశతకం వల్లిస్తుంది.

"వెధవపెళ్ళి లేకపోతేనే సుఖం, ఉద్యోగం చేసివచ్చి, ఏ అర్ధరాత్రి మొగు డన్నవాడు చేరదిస్తే, అహా ఇదే నా భాగ్యము అని మురిసిపోయి, పిల్లల్ని కని, ఇంటిల్లిపాదికీ ఊడిగంచేసి. ఛీ! నా కొద్దుబాబోయ్!" అంటుంటుంది.

... కానీ సుబ్బారావు ఆమె మాటలు కొన్నాళ్ళు నమ్మాడు. ఆవిడకు నిజంగా నే పెళ్ళి ఇష్టంలేదనీ భావించాడు. బావమరిది పెళ్ళికెళ్ళినప్పుడు, కూచునేందుకూ నడుం లాగినా పడుకునేందుకూ చోటు లేక, నీలుగా వుంటుందని, ఓ మూలగా వున్న సరుకులగదిలో, బియ్యంబస్తాని ఆనుకు నిద్రపోతున్న సుబ్బారావుకి, మెళకువవచ్చి చూస్తే....

సుందరి అక్క, ఆ గదిలో కొచ్చి, ముసుగుపెట్టి బస్తాకు ఆనుకునివున్న సుబ్బారావుని ఏ మూటో, వస్తువో అను కుని, తాపీగా జాకెట్, అ తర్వాత బ్రా, ఆ తర్వాత చీర తొలగిస్తుండగా,

సుబ్బారావుకు మెలకువ వచ్చింది. అంతేగాదు, తుమ్మను కూడ తుమ్మాడు. అప్పుడు, ఆ వదినగారు చెక్కుచెదరక, తొణకక, సుబ్బారావువేపు చిలిపిగా చూసి నవ్వింది. సుబ్బారావుకు ఒళ్ళు గగుర్పొడిచింది. ఆమె మాత్రం తాపీగా చీర మార్చుకుని, బ్రా వేసుకుని, "అలా చూస్తారేం? వచ్చి సాయంచేస్తే మీ పాతివ్రత్యాని కేమన్నా భంగమా!" అంది. సుబ్బారావుకు హుషారొచ్చి, బ్రా హుక్ పెట్టి, అంతటితో వూరుకోక ఆమె బుగ్గన ఓ వేడిముద్దు పెట్టుకున్నాడు! అప్పటికీ ఆమె తొణక్కుండా, "ఏమో? అనుకున్నాను! మీరూ సరసులే!" అని గట్టిగా మీదపడి కౌగిలించుకో ప్రయత్నం చేస్తుండగా .... తలుపు చప్పుడైంది. లేకపోతే?....

సుబ్బారావుకు ఆ సమయంలో పాత మధురస్మృతులు గుర్తొచ్చాయి. హుషారుగా మంచంమీదనుంచి లేచాడు.

"ఇదిగో! ఇలా వట్టినీళ్ళు పోస్తే రేపట్నుంచీ వాడుక మానెయ్యి. బూత్ పాలు చౌక అవి తెచ్చుకుంటాం! డబ్బా పోయి, శనిపట్టుకున్నట్లయింది" అని సుందరి పాలవాణ్ణి గదమాయిస్తోంది.

"త్వరగా రండి! కాఫీ కలుపుతున్నా."

సుబ్బారావుకు ఖాళీ పళ్ళపొడి డబ్బా ప్రత్యక్షమైంది. పేస్ట్ క్రితం నెలలో తేలేదు! ప్రక్కింటి పొయ్యిదగ్గర ఇంత బూడిద తీసుకుని, పళ్ళు తోమేసి, తాటాకుతో నాలుక గీసేసుకుని, కాఫీ పుచ్చుకున్నాడు.

ఇద్దరు పిల్లలూ, బడికి బయలుదేరుతూ సుబ్బారావు దగ్గరకొచ్చారు. 'మామూలు' కోసం! జేబులు వెతికితే ఓ అర్ధరూపాయి బిళ్ళ దొరికింది. అదిస్తే బస్సులో టిక్కెట్టుకు వుండదు

"ఒరేయ్! సాయంత్రం స్వీట్సు తెస్తా! వెళ్ళండి" అన్నాడు.

"ఎప్పుడూ తెస్తావంటావ్? తేవు!"

ఆడపిల్ల అన్నది. సుందరి ఆ మాట దొరకపుచ్చుకుని, "అంతేనమ్మా! మీ నాన్న ఏదీ కాదు, తేను అనరు మాటల్లో! చేతలు మటుకు శూన్యం!" అనంది.

పిల్లలు బడికెళ్ళారు.

సుబ్బారావు వెళ్ళి, సుందరి వంట చేస్తుంటే అక్కడ కూర్చున్నాడు.

"ఏం? ఇలా తగలబడ్డారు! తీరిగ్గా."

"నా బ్రతుక్కి అదొక్కటే తక్కువ!"

"ఏం ఇప్పుడు నీకేం తక్కువైంది! మహారాజులాంటి భర్త, ఆణిముత్యాల్లాంటి బిడ్డలు!" అని బుగ్గమీద సుతారంగా చిటికేశాడు.

సుందరి, సుబ్బారావు చెయ్యిని సాధ్యమైనంత కోపంగా విసరికొట్టింది. ఆమె

కళ్ళల్లో నీళ్లు సుళ్లుతిరిగాయి: "అవును ఏం తక్కువ: చీరలు, నగలు, స్వంత ఇల్లు, పనివాళ్లు: అబ్బో! మీరు తెచ్చే లక్షలు: వంటకు, ఇంటిపనికి నేనున్నా. చాలు!" ఆమె గొంతులోంచి చివరి మాటలు తడిసి ముద్దగా వచ్చాయి.

సుబ్బారావుకు క్షణం ఏంచెయ్యాలో, ఎలా ఆమెను సముదాయించాలో తెలియ లేదు: ఆమె మాటలు గుండె లోతు ల్లోంచి వచ్చాయని మాత్రం సుబ్బారావు గ్రహించాడు. గొంగళిపురుగులా ఆ భావ నతో ముడుచుకుపొయ్యాడు క్షణకాలం:

"నాలాంటి అసమర్థుడిని కట్టుకున్నం దుకు శిక్ష! అవునా?" ఆ గొంతులో నిస్స హాయత, జాలతనమూ వున్నాయి.

"నా ఖర్మకు ఎవరు బాధ్యులు లేండి!" సుందరి లేచి వెళ్ళిపోయింది అక్క డ్నుంచి.

సుబ్బారావుకు సుందరి మనసు తెలుసు. ఉన్నదాంట్లో పొదుపుగానే సుందరి సంసారం శిథిలపడకుండా చేస్తు న్నది. అయినా నిత్యావసరాలు పెరుగు తూనే వున్నాయి. ఎలా?

ఇందుకు సుబ్బారావుకు ఓ పథకం వుంది: దాన్ని అమలుపరిస్తే ఆర్థిక ఇబ్బం దులు తొలగుతాయని సుబ్బారావు నమ్మకం. ఆ పథకంలోని వివరాలు చెప్పకుండా సుందరికి ఓ ముక్క చెప్పాడు ఇదివరలో. అదేమిటంటే?

"మీ అక్క ఈ వూరు బదిలీ చేయించుకుంటే, అందరం కల్సే వుండొచ్చు!"

"ఏం? దాని బ్రతుకూ పాడుచేద్దామనా మీ ఉద్దేశ్యం!" అనంది.

సుబ్బారావు రెట్టించి తన ఉద్దేశ్యం వివరణపూర్వకంగా చెబుదామని అను కున్నా సుందరి వడపీయలేదు. "మీ ఆలో చన నాకు తెల్సు. నా బొందిలో ప్రాణ ముండగా అది ఇక్కడకు బదిలీచేయించు కుని వచ్చి నా యింట్లో వుండేందుకు వీల్లేదు!"

"నా మీద నమ్మకం లేదా?"

"అవన్నీ నా కనవసరం: నా సంసా రంలో చిచ్చుపెట్టుకునేంత అమాయకు రాల్నేం గాదు. అయినా దానితోలి మీ కెందుకు: దాని తిప్పలు అది పడుతున్నది మనింటికొచ్చి మనల్నేం ప్రాధేయ పడనూలేదు!"

"అహ: అదికాదు: కొంచెం డబ్బు అడిగి తీసుకుంటె-అప్పుక్రింద అనుకో!"

"అంత మీకు వూళ్ళో పరపతి లే పోతే, ఇవిగో, గాజులు తీసుకెళ్ళి అమ్మేసి, మీ అవసరాలు తీర్చుకోండి అంతేగాని, నా పరువు తీసుకెళ్ళి దా దగ్గర తాకట్టు పెట్టకండి!"

సుబ్బారావు పథకంప్రకారం సుంద

అక్కకు నలభయ్యేళ్లొచ్చాయి కనుక పెళ్ళికాదు. తను అందగాడు కాకపోయినా, కాస్త రుచిగా తిని, మంచి గుడ్డ లేసుకుంటే కంటికి నదరుగానే కనపడతాడు. సుందరి వంటకూ, ఇంటిపనికీ తప్ప, శృంగారానికి పనికిరాదు. ఇద్దరూ అక్కచెల్లెళ్లే కనుక పెద్దగా రాద్ధాంతం వుండదని అనుకున్నాడు.

"ఇంకా అలాగే కూర్చున్నారేం? స్నానం చెయ్యండి. పంపు ఆగిపోతుంది"

సుబ్బారావు లేచి స్నానాలగదిలోకి వెడుతుంటే, మేడమీద గదితలుపు తీసి వుంది. గదిలో వుండే రాజారావును పలకరిద్దామని మేడమీదకెళ్ళాడు.

రాజారావు నిద్ర లేవలేదు. పరుపు మాసివుంది ఓ ప్రక్కగా. రాజారావు మరో ప్రక్కన పడి నిద్రపోతున్నాడు. సిగరెట్ పీకలు, అగ్గిపుల్లలు గదినిండా పడివున్నాయి. అలమార్లో ఖాళీ బీరు సీసాలు, సగం వదిలేసిన తినుబండారాలు వున్నాయి. గోడలకు అంటించిన అర్ధనగ్న సుందరీమణుల బొమ్మలు ఒక మూల కుప్పగా దుమ్ము, అరటి తొక్కలు!

"రాజారావుకేం? యువరాజు" అనుకున్నాడు సుబ్బారావు.

"మాష్టారూ టైమెంత?"

"నువ్వు మేలుకునే వున్నావుటోయ్!.. టైము ఎనిమిది దాటివుంటుంది!"

"మీ రెళ్ళేప్పుడు తలుపు దగ్గరకేసి వెళ్ళండి!" రాజారావు లుంగీ సరిచేసుకుని, దుప్పటి కప్పుకున్నాడు.

అలమారలోంచి పాత వారపత్రిక తీసుకున్నాడు, సుందరికి కాలక్షేపం అవుతుందని. పత్రిక తీస్తుంటే దానిక్రింద ఐదురూపాయలనోటు వుంది. సుబ్బారావు తీసుకున్నాడు. తిరిగి వస్తూ, రాజారావు ప్రక్కనవున్న సిగరెట్ పెట్టెలోంచి ఓ సిగరెట్ తీసి వెలిగించుకుని తలుపు దగ్గరేసి, క్రిందకు వెళ్ళిపోయాడు

యువరాజు కథ

రాజారావుకు, కళ్ళమీద, కిటికీలోంచి ఎండపడి చురుక్కుమనేసరికి మెళకువ వచ్చింది. ప్రక్కనేవున్న గడియారం తీసి చూశాడు టైము. గడియారం ఆగిపోయింది. గది బయటకొచ్చి చూశాడు! క్రింద వాటాల్లోవున్న పురుషులెవరూ కనబడలేదు. ఎదురింటి మేడమీది నర్సు, ఆస్పత్రికి బయలుదేరుతున్నది. ఎవరింటి రేడియోలోనూ పాటలు రావడంలేదు.

రాజారావు త్వరత్వరగా బ్రష్ తీసుకుని పళ్లు తోమేశాడు. బకెట్లో కాసిని నీళ్ళుంటే ముహంకడిగేసుకుని, స్నానం సాయంత్రం అని తీర్మానించుకుని. ముహానికీ, చంకల్లోనూ పౌడరు దట్టంచేసి, లాగు, చొక్కా తగిలించేసుకుని



గదికి తాళంవేసి రోడ్డునపడ్డాడు.

రాత్రి పుచ్చుకున్న మందు తాలూకు, తలదిమ్ము తగ్గలేదు. పైగా ఆకలిగావుంది. కనబడ్డ ఆటో ఎక్కేసి 'పో సీ య్' అన్నాడు.

రాజారావు ఈ నెలలో ఇప్పటికే మూడుసార్లు ఆఫీసుకు ఆలశ్యంగా వెళ్ళాడు. మరోసారి ఆలశ్యమైతే ఓ రోజు సాధారణ సెలవు, హుష్ కాకి అవుతుంది.

దారిలో ఆటోడ్రైవరును అడిగాడు "టైమెంత" అని - చెప్పాడు ఐదు నిముషాలు! అంతే! అసహనంగా కూర్చున్నాడు ఆటోలో. సరిగ్గా యింకో వంద గజాల్లో ఆఫీసుందనగా ట్రాఫిక్ ఆగిపోయింది.

కేకలు.

నినాదాలు.

పోలీసు వ్యాన్లు.

జనం!

"ఏమైంది!" రాజారావు ఆటోలోంచి తల బయటకు పెట్టి చూశాడు.

ఏవేవో నినాదాలు - కాలేజీ కుర్రాళ్ళు రోడ్డుమీద బైఠాయింపు సమ్మె చేస్తున్నారు.

రాజారావుకు తొందరెక్కువైంది. పోసీ దిగి నడిచివెడితే.

"పదికి చిల్లరుందా!"

"రూపాయి తక్కువుంది!"

పది ఇచ్చేసి, చిల్లర పుచ్చుకోని రోడ్డు కడ్డంగా పడి, జనం మధ్యలోంచి, పరుగులా ఆఫీసులోకెళ్ళాడు. రిజిష్టరువుంది. హమ్మయ్య లేచిన వేళావిశేషం బావుంది అనుకుని హాజరైనట్లు సంతకం పెట్టేశాడు. అప్పటికి మనసు కుదుటపడ్డది.

తిన్నగా పనిచేసే సెక్షను కెళ్ళాడు.

సుజాత తప్ప అందరూ తమతమ కుర్చీల్లో వున్నారు. సూపర్నెంట్ దగ్గరకెళ్ళి నమస్కారం చేసి నవ్వాడు.

"ఏం? పర్మిషనా?"

"టిఫిన్ తినేసివస్తా! జస్ట్ ఆఫ్ ఎవవర్!"

"వెళ్ళు నాయినా! నీకేం యువరాజువి! టిఫిన్‌కని వెళ్ళి అలాగే వెళ్ళకు ఇవ్వాళ జీతాలిచ్చేరోజు."

"అలాగే సార్!"

వరండాలో సుజాత కనుపించింది. "వస్తారా! కాఫీ తాగుదాం!" అన్నాడు.

"హెడ్ ఏమంటాడో!"

"నే చెబుతాలే రాండి!" రాజారావు బొంగురుగా చెయ్యిపుచ్చుకున్నాడు.

ఇద్దరూ వెళ్ళి ఫ్యామిలీరూంలో కూర్చున్నారు. సుబ్బారావు ఏకంగా తాగబడ్డాడు సిగరెట్ త్రాగుతూ!

"ఏం! రాత్రి కిక్ తగ్గలేదా!"

రాజారావు నవ్వాడు.

"ఇలా రోజూ త్రాగితే లివర్ పాడవదూ! అయినా మీ రెందుకు పెళ్ళిచేసుకోరూ!"

"నిజం చెప్పనా!"

"ఊ!"

రాజారావు లేచి కూర్చుని, ముందుకు వంగి, సుజాత బుగ్గ గిల్లి, "నువ్వు 'ఊ' అనందే!" అన్నాడు.

సుజాత తల వంచుకుని, "మీరు చెప్పింది నిజమా! అబద్ధమా!" అనంది.

"నిజమే. సుజీ!"

సుజాత రాజారావు కళ్ళల్లోకి సూటిగా చూసింది! రాజారావు కన్నుకొట్టాడు చిలిపిగా!

"మిమ్మల్ని నమ్మొచ్చా!"

"అంటే!"

"మీ రిలా ఎంతమందితో అన్నారో!"

బేరర్ వస్తే, "రెండు మసాలా దోసె" అని చెప్పాడు రాజారావు

"నాకొద్దు!"

"ఏం!"

"అన్నం తినొచ్చాను!"

"రెండు వత్రాలావోయ్!"

బేరర్ వెళ్ళాక, రాజారావు మరో సిగరెట్ ముట్టించి, "చూడు అమ్మలూ! నువ్వు వచ్చావు! ఓకే అంటే చెప్పు! మ్యారేజీ చేసుకుందాం!" అన్నాడు.

సుజాత ఏం సమాధానం చెప్పాలో తెలియక ఉండిపోయింది. రాజారావు క్రొత్తగా ఉద్యోగంలో చేరాడు. డబ్బు ఖర్చుచెయ్యడం, అప్పులివ్వడంవల్ల పని చెయ్యకపోయినా ఆఫీసులో ఎవ్వరూ ఏమీ అనరు. అందరూ అనుకోవడం అతనికి భూములూ, రైసుమిల్లులూ వున్నాయని! నిజానిజాలు తెలియవు అలాంటి మనిషితో వివాహం జరిగితే?

"డియర్ సుజీ! నన్ను నమ్మవా?" రాజారావు వెళ్ళి, సుజాత ప్రక్కన కూర్చుని, ఆమెమీద చెయ్యివేసి, చిన్నగా నొక్కాడు భుజాన్ని.

"నాకిలాంటివి ఇష్టంలేదు!" ప్రక్కకు జరుగుతూ అంది సుజాత!

"పోనీ ఆలోచించి చెప్పు!"

ఇద్దరూ టిఫిన్ తిని ఆఫీసు కెళ్లారు.

సుజాత రాజారావు చెప్పిన మాటల మత్తులో ఆఫీసుకెళ్ళింది. రాజారావు మధ్యాహ్నందాకా ప్రతి గదిలోకి వెళ్ళి మిత్రులను పలకరించి, రెండుగంటలకు జీతంతీసుకుని హెడ్‌గారికి నమస్కారం కొట్టేశాడు.

"వెళ్లు నాయినా! మా కెలాగూ ఈ బడవా చాకిరీ తప్పదు! వెళ్ళు!"

రాజారావు సుజాతదగ్గరకెళ్ళి "సినిమా కెళ్దామా?" అనడిగాడు రహస్యంగా!

"నాకు పెళ్ళికిముందు ఇలా తిరగటం ఇష్టంలేదు!"

రాజారావు భుజాలెగరేసి, తిన్నగా మిత్రుడు యాదగిరిదగ్గర కెళ్ళాడు.

"పద పోదాం!"

"ఎక్కడికి?"

"ముందు లే! తర్వాత ఎక్కడికో చెబుతాను!"

యాదగిరి లేవక తప్పలేదు. ఆఫీసు ఫైళ్ళు కట్టగట్టేసి, పర్మిషన్ తీసుకు వచ్చాడు.

రాజారావు, యాదగిరి ఆటో తీసుకుని సెంటర్‌కెళ్ళి బార్‌లోకి వెళ్ళారు!

"ఇందాక సుజాతతో తిరుగుతున్నావ్? ఏమిటి సంగతి?"

"నువ్వెప్పుడు చూశావ్?"

"ఎప్పుడు చూస్తే నీ కెందుకుగానీ, సంగతి చెప్పు! ఏమంటున్నది?"

యాదగిరికి రాజారావు దినచర్య తెలుసు!

"బెదురుగొడ్డురా! ముట్టుకుంటె ముడుచుకుపోతున్నది!"

"పెళ్ళిచేసుకుంటా ననలేదూ!"

"అన్నా! పెళ్ళయితేగాని లాభం వుండేలా లేదు!"

"చేసుకో!"

"దాన్నా!" రాజారావు నవ్వాడు.

ఇద్దరూ మందు పుచ్చుకోవడం మొదలెట్టారు. ఒక్కొక్క పెగ్గూ లోపలకు పొయ్యేకొద్దీ రాజారావులోని మనిషి బయటకు రాసాగాడు.

"అరేయ్! యాదగిరీ! ఇక్కడ కనబడే ఆడాళ్ళంతా ప్లాస్టిక్ పువ్వులురా! అంతే! తిండికోసం మొగుడుంటే చాలు. భయంలేదని నమ్మేవాళ్ళు. వీళ్ళతో పెళ్లేమిటిరా! మా వూళ్ళల్లో ముద్దమందారంలా వుండే పిల్లలున్నారు. అసలు మా పైడున్న బోగంది వీళ్ళకన్నా వేయిరెట్లు

వయం! అయినా బ్రెదరూ— ఈ నైలాన్ చీరలో అందాలు, ఓ రాత్రికే సరి! అంతే పట్టుచీరల్లో బంగారంముద్దల్లాంటి పిల్లలు లక్షరూపాయల కట్నంతో మా యింటిముందు పడిగాపులు పడివున్నారు! తెల్సా!"

"మరి పెళ్ళిచేసుకోరాదూ!"

రాజారావు కళ్ళు ఎరుపెక్కాయి.

"మా యింటిక్రింద సుబ్బారావని ఓ గుమాస్తాగాడున్నాడు! వాడికి ముగ్గురు పిల్లలు! పెళ్ళాం అది పెళ్ళాంగాదు పీనుగ! వీడు సుబ్బారావు దాంతో కాపురం హెల్! వాళ్ళను చూస్తే భార్యాభర్తల్లా వుండరు! కసిగా పోట్లాడకుంటూ యే బజారుకుక్కలో! అలా వుంటారు! అమ్మ బాబోయ్! పెళ్ళిచేసుకుంటే, నేనూ ఆ సుబ్బారావులా అయితే!"

"ఇలా పైలాపచ్చీసుగా ఎన్నాళ్ళురా!"

"సాగినన్నాళ్ళు! సుజాత అంతు చూస్తాలే! పెద్ద పతివ్రత కబుర్లు! మెహరున్నిసా కేసు తెలుసుగా! పెళ్ళో అని వెంటబడ్డది. దాని కడుపుకు నేను బాధ్యుడనట! ఛీ! పోవె నీయమ్మ! మళ్ళీ కంటబడితే చంపేస్తానన్నా! అంతే! మళ్ళీ కనబడలా! ..."

యాదగిరి సాయంత్రం పనుందని వెళ్ళాడు! రాజారావు ఒంటరివాడైనాడు. ఏం చెయ్యాలి!

అటో ఎక్కి బ్లూఫిలిం చూసేందుకు వెళ్ళాడు రాజారావు ఎరుపెక్కిన కళ్ళతో!

మహారాజు కథ

సుబ్బారావు గుండెలమీద సుందరి పడుకొనుంది. ఆమె తలలో సంపెంగ పూలు గదినంతా సువాసనతో నింపాయి.

సుబ్బారావుకు చాలా సంతోషంగా వుందిప్పుడు. సుందరి చాలారోజుల తర్వాత ప్రేమగా సుబ్బారావును కౌగలించుకుని పడుకొనుంది. ఆమె కళ్ళల్లో తృప్తి సుబ్బారావును యౌవ్వనపు రోజుల్లోకి తీసుకెళ్ళింది.

.... ఆ రోజుల్లో సుబ్బారావు యువరాజులా గడిపాడు. దిగులూ, చింతా లేని బ్రతుకు. తినడం, తిరగడం, పుస్తకాలు చదవడం. సాయంత్రం మిత్రులతో ఏ గుడి ఆవరణలోనో, కాలవగట్టు ప్రక్కనో రాజకీయాలు, సాహిత్యం, నాటకాలు గురించి చర్చించుకోవడం!— ఆ రోజులు మళ్ళీ రావేమో!

సుందరి.... నిజంగా దేవతే! పిల్లల్ని చక్కదిద్దుకుంటుంది. తన సంపాదనలో గుట్టుగా కాపురం చేస్తున్నది.... ఇలాగే జీవితం సాగితే కావల్సిందేముంది!

ఇలా సుబ్బారావు గతకాలపు మధుర స్మృతులు, భవిష్యత్తులోని సుఖమయ జీవితంగురించి కలలు కంటుండగా,

అటో చప్పుడైంది. ఆ తర్వాత

తలుపు చప్పుడైంది. 'సుబ్బారావుగారూ' అనడం వినపడ్డది.

సుబ్బారావు కలం అలానుంచి మేల్కొన్నాడు. సుందరీ వెంటవచ్చింది ఏమిటా అని!

రాజారావు ఎదురుగా. తలకు చేతికి చిన్న కట్టు, లాగు మోకాలిదగ్గర చిని గింది!

"ఏమైంది?"

"తర్వాత చెబుతా! ఓ పదుంటే ఇవ్వండి!"

సుజాత తెచ్చి ఇచ్చింది, రాజారావు వాడికిచ్చి పంపేశాడు.

సుబ్బారావు తెచ్చిన కుర్చీమీద కూర్చు న్నాడు రాజారావు.

"ఇప్పుడు చెప్పండి ఏమైంది?"

"ఫ్రెండుదగ్గరి కెళ్ళవస్తుంటే యాక్సి డెంట్ అయింది! డబ్బులూ పోయాయి!"

"అరెరె! మందేసుకున్నారా! నొప్పిగా వుందా!"

"ఉందండి బాబు! చాలా నొప్పిగా వుంది! వెళ్ళి పడుకుంటాను. మీ డబ్బు రేపిస్తాను!"

"అలాగే! నేను మీ కివ్వాల్లేంటి ఇంతకుముందో అయిదు! ఇవ్వాళ ఉదయం ఓ ఐదు తీసుకున్నా!"

రాజారావు లేచాడు.

"తమ్ముడూ! ఈ వేడిపాలు తాగు!" సుందరి వచ్చింది!

రాజారావుకు ఏడుపొచ్చింది. దాన్ని దిగమింగుకునే పాలు త్రాగాడు. గ్లాసు యిస్తూ ఆమెకు మనస్ఫూర్తిగానే నమస్క రించాడు. 'తమ్ముడూ' అన్నందుకూ! తన ఆకలి గుర్తించి పాలిచ్చినందుకూ!

రాజా-యువరాజా యువమహారాజా

నేలలో ఒకరోజు మరణిస్తున్నది. మరోరోజు మరికొద్దిసేపట్లో ఉదయిస్తు న్నది. మళ్ళీ కోడి కూస్తుంది.

సూర్యుడు మళ్ళీమళ్ళీ పుడుతూనే వుంటాడు. పక్షులు కిలకిలా అంటూనే వుంటాయి!

రాజారావు ఆ రాత్రి తీర్మానించు కున్నాడు. పెళ్ళిచేసేసుకోవాలి!

సుబ్బారావుకేం? మహారాజు! తిన్నా తినకపోయినా రోగమొచ్చినా సేవచేసేం దుకు భార్యవుంది!

అదే సమయంలో సుబ్బారావూ అను కున్నాడు? ఏమనీ?

రాజారావుకేం అదృష్టవంతుడు. బాదర బందీలు లేవు! యువరాజులా తిరుగుతాడు! అని.

—కానీ—

నిన్నటి యువరాజే నేటి మహారాజు

నేటి మహారాజే నిన్నటి యువరాజు

—అని—

చాలామందికి తెలియదు అనలేం!

—మర్చిపోతారు—

—అంతే—

**